సాక్షి అనకాపల్లి

సోమవారం, 18, సెప్టెంబర్, 2023



జగన్ పాలన ఆదర్శం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. 8లో



స్వచ్ఛ సాగర్

అచ్యుతాపురం(అనకాపల్లి): పూడిమడక తీరంలో ఆదివారం స్వచ్ఛ సాగర్ కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా వైశాఖీ నృత్యోత్సవం



వైశాఖీ నృత్యోత్సవం వైభవంగా ముగిసింది. మూడు రోజుల పాటు విశాఖ లోని కళా భారతి ఆడిటోరియం లో నృత్యోత్సవం నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

రూ.1.83 కోట్లతో బొజ్జన్న కొండపై అభివృద్ధి పనులు

ఎంపీ బి.వి. సత్యవతి



డిజైన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: జిల్లాలోని ప్రముఖ బౌద్ధక్షేత్రం, చారిత్రకంగా గుర్తింపు పొందిన శంకరం వద్ద గల బొజ్జన్నకొండను అభివృద్ధి చేయనున్నామని ఎంపీ బి.వి.సత్యవతి తెలిపారు. టూరిజంశాఖ అధికారులతో కలిసి బొజ్జన్నకొండను, డిజైన్‌ను ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.1.83 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఈనెల 24న ప్రారంభించనున్నట్టు చెప్పారు. పర్యాటకులకు అనుకూలంగా ఉండేలా డిజైన్‌లో పలు మార్పులను అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజంశాఖ ఏఈ రాము, డీఈ స్వామి, ఏఈ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా గొంప



గొంప నర్సింహ నాయుడు(నునపర్తి)

అచ్యుతాపురం(అనకాపల్లి): ఉమ్మడి విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అచ్యుతాపురం మండలం నునపర్తికి చెందిన గొంప నర్సింహ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలోని ద్వారకానగర్‌లో గల సెంట్రల్ లైబ్రరీ హాల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన మండలాల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. నునపర్తి గ్రామంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణ,శిక్షణ ఇప్పించడంలో గొంప నర్సింహనాయుడు చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

కుస్తీ పోటీల్లో పాములవాక విద్యార్థి సత్తా



కుస్తీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థి గణేష్‌తో పీడీ అచ్యుతరావు

కోటవురట్ల: కుస్తీ పోటీల్లో పాములవాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కన్నూరు గణేష్ సత్తా చూపి, గోల్డ్ మెడల్ సాధించాడు. కొయ్యూరు కుస్తీ అకాడమీలో జరిగిన కుస్తీ పోటీల్లో అండర్ 14 విభాగంలోని 62 కిలోల కేటగిరీలో ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. గణేష్‌ను హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కిల్లాడ సాయి, సర్పంచ్ సత్యవతి. కమిటీ చైర్మన్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

ఎస్.రాయవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్టు పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో హాకీ క్రీడాకారుల ఎంపిక నక్కపల్లి హైస్కూల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సెలక్షన్స్‌లో ఎస్.రాయవరం హైస్కూల్లో 9 వ తరగతి చదువుతున్న ఎ.భార్గవి, కె.కావ్యలు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు.

30 నుంచి ఏయూ తరగతులు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం బీటెక్, బీఆర్క్, ఎంటెక్, ఎంఆర్క్, ఎంసీఏ, ఎమ్మెస్సీ ప్రథమ సంవత్సరం తరగతులు ఈ నెల 30న ప్రారంభించనున్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులను ఉద్దేశించి ఏయూ వీసీ పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం తరగతులను లాంఛనంగా ప్రారంభిస్తారు. ప్రవేశం పొందిన విద్యార్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు కన్వెన్షన్ సెంటర్‌కి చేరుకోవాలని ప్రిన్సిపాల్ శశిభూషణరావు సూచించారు. 29న తమ విభాగంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. 28నుంచి హాస్టల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు.

చవితి సందడి



పూజకు అవసరమైన పత్రులను కొనుగోలు చేస్తున్న జనం

- కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్లు
- ఆకాశాన్నంటిన పూజాసామగ్రి ధరలు
- పత్రి ధరలు మరింత ప్రియం

అనకాపల్లిటౌన్/చోడవరం/నర్సీపట్నం: స్థానిక మార్కెట్లకు ఆదివారం చవితి శోభ సంతరించుకుంది. ఆది దేవుడు, విఘ్నాలు తొలగించే వినాయకుడి చవితి పండగను ధనిక, పేద భేదం లేకుండా ప్రతి ఒక్కరూ చేసుకునే పండగ కావడంతో మార్కెట్లు, ప్రధాన కూడళ్లు వినాయక విగ్రహాలు, పత్రి, పూజా సామగ్రి వ్యాపారులు, కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అనకాపల్లిలోని నెహ్రూచౌక్, చిననాలుగురోడ్ల కూడలి, నర్సీపట్నం ప్రధాన జంక్షన్ అబిద్ సెంటర్‌లు కిక్కిరిసిపోయాయి. వాహనాలు నిలిపేందుక్కూడా వీల్లేనంతగా జనాలు రావడంతో సాయంత్రం నుంచి రాత్రి వరకూ వ్యాపారాలు కొనసాగాయి.

చవితి సం'భారం'

చవితిపూజ, పైపెచ్చు ఆదివారం కావడంతో మార్కెట్లకు జనం పోటెత్తారు. దీన్ని అలుసుగా తీసుకున్న వ్యాపారులు ప్రతి వస్తువు ధరను విపరీతంగా పెంచేశారని కొనుగోలుదారులు వాపోయారు. చిన్న సైజు మట్టి గణపతి ప్రతిమ రూ.30 నుంచి రూ.50 వరకు అమ్మకాలు సాగాయి. కొబ్బరికాయ చిన్నది రూ.30 నుంచి 50 పలికింది. దేశవాళీ అరటిపండ్లు డజను రూ.90కి పైనే. పాలవెల్లి రూ.30కు, పత్రి నాలుగు రెమ్మలు కలిపి రూ.20 నుంచి రూ.50 వరకు విక్రయించారు. హిందువుల తొలి పండగ కావడంతో ధరలు మండిపోతున్నా కొనుగోలు పరిమాణం తగ్గించుకుని జనాలు సరిపెట్టుకున్నారు. పూలు, ఇతర పండ్ల ధరల్ని అడగాల్సిన పనిలేదు. ఒకప్పుడు రూ.10–20కి ఇచ్చే పూలు ఇపుడు రూ.50–70 మధ్య విక్రయించారు. ఆపిల్, సీతాఫలం, ద్రాక్ష, జామ, నారింజ, వెలగపండు తదితర సామగ్రి తినేందుకు పనికిరాని సైజ్‌లో ఉన్నవాటిని కూడా భారీగానే డబ్బులు వెచ్చించి, కొనాల్సి వచ్చిందని కొనుగోలుదార్లు చెప్తున్నారు.

యువతలో చవితి సందడి

వినాయక చవితి వస్తుందంటే యువతలో ఉండే ఉత్సాహం అంతా ఇంతా కాదు. వారం పది రోజుల ముందు నుంచే వీధుల్లో పందిళ్లు, మండపాల ఏర్పాటులో తలమునకలయ్యారు. వాటికి సినీ సెట్టింగ్‌లతో ముస్తాబు చేస్తున్నారు. గ్రామాల్లో వీధికో పందిరి వేస్తూ హడావుడి చేస్తున్నారు. గ్రామంలో తమ విగ్రహమే పెద్దదిగా ఉండాలన్న పోటీల కొద్దీ డబ్బులు పోగు చేసుకుని, విగ్రహాల కొనుగోలుకు బయలుదేరారు. అయితే వీరి ఉత్సాహాన్ని కూడా విగ్రహాల ధరలు కాస్త నీరుగార్చాయి. అయినప్పటికీ ఉన్నంత మేరకు ఘనమైన విగ్రహాలనే కొనుగోలుచేశారు. విగ్రహాన్ని మండపం వద్దకు తీసుకొచ్చేందుకే పలువురు డప్పులు మేళాలు ఏర్పాటు చేశారంటే.. యువతలో చవితి సందడి ఏ తీరున ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు.



పంపిణీకి సిద్ధం చేసిన మట్టి గణపతి విగ్రహాలు



కొనుగోలుదార్లతో రద్దీగా మారిన అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలి



విక్రయానికి ఉంచిన భారీ విగ్రహాలు

భక్త వరదుడు.. ఒడ్డిమెట్ట ఏకదంతుడు

- నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు
- జాతరకు వేలాది మంది హాజరు

నక్కపల్లి: విఘ్నాలు తొలగించే వినాయకుడిగా, భక్త వరదుడుగా, గ్రామీణ జిల్లా భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. వినాయకచవితి నుంచి తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. చవితినాడు స్వామిని దర్శించుకునేందుకు అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, తుని, అన్నవరం, పాయకరావుపేట, నక్కపల్లి తదితర పట్టణాలనుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఒడ్డిమెట్ట కైలాసగిరిపై దాదాపు నూరేళ్ల క్రితం తాటిచెట్టు మొదలులో లక్ష్మీగణపతి వెలిశాడని పూర్వీకుల కథనం. నామవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి స్వామి కలలో కనిపించి కైలాసగిరిపై పలానా చోట తాను వెలిశానని చెప్పడంతో అక్కడ తవ్వకాలు జరుపగా విగ్రహం బయటపడింది. జాతీయరహదారికి ఆనుకుని మండపం వేసి విగ్రహాన్ని పెట్టి పూజలు చేయడం ప్రారంభించారు. హుండీలలో, కానుకల రూపంలో లభించిన ఆదాయంతోపాటు విరాళాలు సేకరించి కొండపై ఆలయాన్ని నిర్మించారు. వినాయకచవితి నాడు ఇక్కడ పెద్ద తిరునాళ్ల జరుగుతుంది. కొత్తగా వ్యాపారం ప్రారంభించేవారు, వాహనాలు కొన్నవారు ఇక్కడి విఘ్నేశ్వరుడికి పూజలు చేసిన తర్వాత తమ పనులు ప్రారంభిస్తారు. ఒడ్డిమెట్ట గ్రామస్తులు లక్ష్మీగణపతిని ఇలవేల్పుగా కొలుస్తారు. చవితినాడు బంధువుల రాకతో ఇళ్లన్నీ సందడిగా ఉంటాయి. ప్రతి ఇంట్లో గణపతి పేరు ఉన్నవారు ఉంటారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి...

తొమ్మిది రోజుల పాటు జరిగే మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి నరిశే వెంకటాద్రి తెలిపారు. ఉదయం 5 గంటల నుంచే స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. సోమవారం సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరి రోజున అన్నసమారాధన ఉంటుందన్నారు.



లక్ష్మీగణపతి

పోలీసు బందోబస్తు

వినాయకచవితి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాది మంది తరలి వస్తారు. దీంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నక్కపల్లి సీఐ అప్పన్న పర్యవేక్షణలో ఎస్‌ఐ శిరీష బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మెట్లమార్గం వరకు వాహనాలను అనుమతించకుండా రోడ్డుపైనేపార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. నక్కపల్లి, పాయకరావుపేటల నుంచి రప్పించి బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిధులు, దాతల విరాళాలు రూ.20 లక్షల వ్యయంతో ఈ ఏడాది కొండపైకి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో పాత రోడ్డును ఆనుకుని నిర్మించిన రోడ్డుమార్గం ద్వారా కూడా భక్తులు కొండపైకి చేరుకోవచ్చు.

30 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కొత్తపల్లి నుండి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామంలో టీడీపీకి చెందిన 30 కుటుంబాల వారు ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. తారువలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి వారిని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సాదరంగా ఆహ్వానించారు. టీడీపీకి చెందిన రెడ్డి నారాయణమూర్తి, కరక దొంగబాబు, కొటాన రాజబాబు, అచ్చిబాబు, బూరె అప్పారావు తదితరులు స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న వీరంతా వైఎస్సార్‌సీపీలో చేరడంతో ఏ.కొత్తపల్లి టీడీపీకి గట్టి షాక్ తగిలింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం అహర్నిశలు శ్రమించామని, టీడీపీ నాయకులు తమ ద్వారా పదవులు అనుభవించి తమ సమస్యలు పట్టించుకోలేదని పార్టీలోని చేరిన వారు స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై తామంతా పార్టీలో స్వచ్ఛందగా చేరామన్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఏ.కొత్తపల్లిని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నాయకత్వంలో తామంతా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తున్న డిప్యూటీ సీఎంపై నమ్మకంతో పార్టీలో చేరామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పండూరి సరువునాయుడు తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్నకు బ్రహ్మోత్సవ శోభ

మాడ వీధుల్లో ఉత్సవ కావడి ఊరేగింపు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం ఈ ఉత్సవాలను నిర్వ హించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం అంకురార్పణ నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభ సూచకంగా మాడ వీధుల్లో ఉత్సవ కావడిని ఊరేగించారు. గరుడాద్రిపై కల్కిఅవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, నిత్యపూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి పసుపు కొమ్ములు, కుంకుమ, కొబ్బరి బొండాలు, కానుకలు సమర్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులకు, సుదర్శన పెరుమాళ్లకు, ఆలయ అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, పీసపాటి శేషాచార్యుల ఆధ్వర్యంలో స్వప్న తిరుమంజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు అలంకరించారు. క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణలో భాగంగా ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, రక్షాబంధనం, అంతరాలయ పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం సుదర్శన పెరుమాళ్లను పల్లకిలోఉంచి గ్రామంలో ఉత్తర ఈశాన్యదిక్కున ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లి మత్స్యసంగ్రహణ(పుట్టమన్ను) తెచ్చే కార్యక్రమం నిర్వహించారు. తాత్కాలిక యాగశాల వద్ద అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, చతుష్ఠాన అర్చనలు పూర్తి చేసి గరుడ అవాహన, గరుడ అప్పాల నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 18నుంచి 26వరకు జరుగుతాయి. 18న సోమవారం ధ్వజారోహణం, 23న వసంతోత్సవం, 25న మృగవేట, 26న పూర్ణాహుతి, వినోదోత్సవం, కంకణ విసర్జన, చూర్ణోత్సవం, అవబృందస్నానం వంటి కార్యక్రమాలు జరుగుతాయని అర్చక స్వాములు తెలిపారు.



స్వామివారి ఉత్సవ కావడిని ఊరేగిస్తున్న అర్చకులు



నూతన వస్త్రాలంకరణలో స్వామివారి ఉత్సవమూర్తులు

బ్రహ్మోత్సవాల్లో దర్శనంతో విశేషఫలితం

కల్కి వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం వల్ల ఎన్నో విశేష ఫలితాలు లభిస్తాయని అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామిని దర్శించుకోవడం వల్ల గ్రహదోషాలు తొలగిపోయి, ఈతిబాధలనుంచి విముక్తికలుగుతుందని చెప్పారు.

దంచికొట్టిన వాన

45 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు



నిర్మానుష్యంగా మారిన నెహ్రూచౌక్

అనకాపల్లిటౌన్: పట్టణంలో ఆదివారం వర్షం దంచి కొట్టింది. సుమారు గంటన్నరపాటు కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. వినాయక చవితి సందర్భంగా స్థానిక నెహ్రూచౌక్‌లో వినాయక విగ్రహాలు, పూజాసామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి. సాయంత్రం వర్షం కురవడంతో వ్యాపారాలు సన్నగిల్లాయి. చవితి సామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చిన ప్రజలకు వర్షం ఆటంకంగా మారింది. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో ప్రధాన రహదారి జోసిపోయింది. 45 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



మునగపాక మండల సముదాయాలకు వెళ్లే దారిలో నిలిచిన వర్షపు నీరు

మునగపాక: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి పోయింది. మునగపాక మండల సముదాయానికి వెళ్లే దారిలో నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం వ్యవసాయానికి ఎంతో మేలు చేకూరుస్తుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దయానిధి, రాజేశ్వరి

తుమ్మపాల: భగవాన్ విశ్వకర్మ గొప్ప ఆర్కిటెక్చర్ అని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ వల్లే చేతివృత్తులు అభివృద్ధి చెందాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానిమంత్రి విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతివృత్తుల వారిని ఆదుకునేందుకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రాజేశ్వరి, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కె.శ్రీదేవి, ఆయా సామాజిక వర్గాల నాయకులు కాశీ వరహాలు, ఎం.కోటేశ్వరరావు, టి.ప్రకాష్, పి.శ్రీనివాసరావు, జి.భారతి తదితరులు పాల్గొన్నారు.

అందరూ స్వామి సేవకులే...


- టీమ్ వర్క్‌తో ముందుకు వెళ్తా..
- సింహాచలం దేవస్థానం ఈవోగా శ్రీనివాసమూర్తి బాధ్యతల స్వీకరణ

సింహాచలం: అందరి సహకారంతో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని, అందరూ స్వామివారి సేవకులేనని భావిస్తానని కొత్త ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం ఈవోగా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సింహగిరికి ఉదయం కుటుంబసమేతంగా వచ్చిన ఆయన తొలుత ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆయన బాధ్యతల స్వీకరణ పత్రాలపై సంతకాలు చేశారు. గత ఈవో వి.త్రినాథరావు ఆయన్ని సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం శ్రీనివాసమూర్తి మీడియాతో మాట్లాడారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి ఈవోగా రావడం భగవంతుడు కల్పించిన అదృష్టంగా భావిస్తానన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అందరి సహకారంతో దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా టీమ్ వర్క్‌తో ముందుకు వెళ్తామన్నారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎంత మంచి దర్శనం అందించగలమన్న విషయంపై ప్రధానంగా దృష్టిసారిస్తానన్నారు. భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. భక్తుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటానన్నారు. ప్రతి నెలా మీడియాతో కూడా సమావేశం ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, దొడ్డి, రమణ, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు ఈవోని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పవన్ కల్యాణ్ ఊసరవెల్లి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఏదో ఒక పార్టీని తిడుతూ, మరో పార్టీతో పొత్తు పెట్టుకుంటూ పవన్ కల్యాణ్ రాజకీయ ఊసరవెల్లిలా తయారయ్యారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విమర్శించారు. చోడవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పొత్తుల కోసం నిరంతరం పాకులాడే పవన్ కల్యాణ్ పార్టీకి ఒక అజెండా అంటూ ఉందా అని ధర్మశ్రీ ప్రశ్నించారు. అవినీతికి పాల్పడిన చంద్రబాబుతో చేతులు కలిపిన పవన్ కల్యాణ్‌కు కూడా ఆ కుంభకోణంలో వాటా ఉందని భావించాల్సి వస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి ఓటమి తప్పదన్నారు. ప్రజల సొమ్ము దిగమింగిన చంద్రబాబు మరిన్ని కేసుల్లో జైలుకు వెళ్లక తప్పదన్నారు. తాను నిర్దోషినని చెబుతున్న చంద్రబాబు మరి ఆ 371 కోట్ల రూపాయలు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీకి లేదని, తప్పు చేసినవారి సంగతి దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థ చూసుకుంటాయని ధర్మశ్రీ అన్నారు. వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేస్తున్న టీడీపీ నాయకులు తమ నాయకుడు చంద్రబాబు చేసిన అవినీతి బాగోతాలపై ఎందుకు మాట్లాడడం లేదని ధర్మశ్రీ ప్రశ్నించారు.



చోడవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



బలగం

ఆటపాటలతో సందడి చేసిన 120 మంది

మునగపాక: మండలకేంద్రం మునగపాకకు చెందిన స్వర్గీయ ఆడారి పెద సన్యాసినాయుడు కుటుంబ సభ్యులు సుమారు 120 మంది ఆదివారం అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. సీఐడీలో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఆడారి వెంకటరావు, జయ దంపతుల కుమార్తె భావన సీఏ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న నేపథ్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. అలాగే హక్కు అనే నాటకాన్ని రచించిన మునగపాకకు చెందిన ఆడారి సోమశేఖర్‌ను కూడా సత్కరించారు. పిల్లలు,పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

తండ్రి, కొడుకుని కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన లైఫ్‌గార్డ్స్‌తో తండ్రి, కొడుకు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతుండగా తండ్రి, కొడుకుని లైఫ్‌గార్డ్స్ కాపాడారు. నత్తన్నపల్లికి చెందిన మేరి, నైమ్ కుటుంబంతో కలిసి ఆదివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు ఇక్కడి బీచ్‌కు వచ్చారు. ఈ క్రమంలో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల తాకిడికి వీరిద్దరూ కొట్టుకుపోతుండగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, ఎమ్.చందు, సతీష్ గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు.

బంగారం చోరీ



చోరీ జరిగిన ప్రదేశం

పాయకరావుపేట: పట్టణంలోని రాజుగారి బీడు వద్ద కరెంటు ఆఫీస్ ఎదురుగా, మిఠాయి కొట్టు పెట్టుకుని వెనుక రేకుల షెడ్డు కట్టుకుని పిచ్చేటి వెంకటరమణ నివసిస్తున్నాడు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తన ఆరోగ్యం బాగోలేదని ఇంటికి తాళం వేసి, కాకినాడ వెళ్లి తిరిగి రాత్రి 10 గంటలకు వచ్చి చూడగా ఇంటి వెనుక తలుపు విరగొట్టి ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో బీరువా తాళాలు విరగ్గొట్టి, లాకర్లో వున్న బంగారు నల్లపూసల తాడు, చైను, ఉంగరం, చెవిలీలు సుమారు ఐదున్నర తులాల విలువ గల బంగారు వస్తువులు అపహరించారని వెంకటరమణ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు.

ఉత్సవాలకు స్వయంభూ ఆలయం సిద్ధం

నేటి నుంచి చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామికి పూజలు



రంగురంగుల పూలతో అలంకరించిన స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం



చోడవరం వినాయకుడి ఆలయ ప్రాంగణంతో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ

చోడవరం: ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం చవితి నవరాత్రోత్సవాలకు ముస్తాబైంది. ఆలయాన్ని రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి సందర్భంగా ఆలయం భక్తులతో మరింత రద్దీగా మారనుంది. వీరు వేలాదిగా తరలి రానున్న దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ఆలయం లోపల పూర్తిగా పూలతో అలంకరణ చేశారు. ఇటీవల నూతనంగా నిర్మించిన తూర్పు రాజగోపురం ద్వారా మొదటి సారిగా స్వామివారి ఆలయంలోకి భక్తులు ప్రవేశించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తెల్లవారి స్వామివారి ప్రత్యేక పూజతో ప్రారంభమయ్యే చవితి పూజలు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్ని రోజులూ జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి వెంకట్రావు, కొడమంచిలి చలపతిరావుల ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు చేయనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మరో పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న పీఎస్‌పేట లక్ష్మీ గణపతి ఆలయంలో చవితి, నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయం నిర్మించి 132 ఏళ్లు పూర్తికావడంతో ఈ ఏడాది ఉత్సవాలు మరింత వైభవంగా జరిపేందుకు ఆలయ కమిటీ చైర్మన్ పుత్రేవు శ్యామ్‌సుందర్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఈ రెండు ఆలయాల్లో గణేష్ దీక్ష మాలధారణ చేసిన భక్తులతో ప్రత్యేక పూజ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చవితి రోజుల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి



పీఎస్‌పేటలో కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి

చోడవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ , అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు బి.వి.సత్యవతి అన్నారు. చోడవరం పంచాయతీ శివారు పీఎస్ పేటలోని సచివాలయం -4 పరిధిలో సుమారు రూ. కోటిన్నర వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసాకేంద్రం, హెల్త్ సెంటర్ల భవనాలతోపాటు ఇక్కడ ప్రసిద్ధి గాంచిన లక్ష్మీగణపతి ఆలయంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఎమ్మెల్యే ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు గ్రామ స్వరాజ్య స్థాపన, గ్రామాల అభివృద్ధికి అన్నివిధాలుగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి, ప్రజలకు సకాలంలో సేవలందించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ప్రాథమిక వైద్యం అందించేందుకు హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. రైతులకు వ్యవసాయ సేవలు అందించడంతో పాటు, పంటల నిల్వలకు మినీ కోల్డ్ స్టోరేజీలు నిర్మించినట్టు చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా మద్దతు తెలపాలని వారు కోరారు. అంతకు ముందు పీఎస్‌పేటలో లక్ష్మీగణపతి స్వామి స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎంపీలను ఆలయ కమిటీ చైర్మన్ పుత్రేవు శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఉపసర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, ఎంపీడీవో చైతన్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి దన్నిన వెంకట్రావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరావు, ఎంపీటీసీ లక్ష్మి, వార్డు మెంబరు కోటేశ్వరరావు, చవితిన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు దోపిడీ దొంగలు

నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: దోపిడీ దొంగలైన చంద్రబాబు, అయ్యన్నపాత్రుడులను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజల సొమ్మును అడ్డగోలుగా దోచుకున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్లను దోపిడీ చేసిన చంద్రబాబు చట్టానికి అతీతుడు కాదన్నారు. తప్పు చేయకుండానే రాజకీయ కక్షతో అరెస్టు చేశారని మరో దోపిడీ దొంగ అయ్యన్నపాత్రుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేరం చేయకపోతే ఢిల్లీ నుంచి లాయర్‌ను ఎందుకు రప్పించారని ప్రశ్నించారు. రెండెకరాల నుంచి రూ.2 లక్షల కోట్లు అక్రమంగా సంపాదించారని విమర్శించారు. చంద్రబాబు జీవితాంతం జైలే అన్నారు. చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్న అయ్యన్నపాత్రుడును ప్రజలు రాజకీయ సమాధి చేస్తారన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చావుకు కారణమయ్యారన్నారు. టీడీపీకి ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేదన్నారు. అందుకే పొత్తులు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో పోటీ చేసే దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని కొనియాడారు. మరో 30 ఏళ్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబు చేసిన స్కామ్‌లు ఒక్కొక్కటి బయట పడుతున్నాయన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: ఆత్మరక్షణ విద్యల్లో కరాటే ముందుంటుందని, అటువంటి కరాటేనే నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తుంటారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. రెన్షీ సుమన్ కోరాడ, ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో 15వ ఏపీ స్టేట్ కెన్‌యూ-ర్యూ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలకు పెట్టింది పేరు గాజువాక అని పేర్కొన్నారు. ఎంతోమందికి కరాటేలో శిక్షణ ఇచ్చి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దిన ఘనత కోరాడ సుమన్‌కే దక్కుతుందని కొనియాడారు. రెన్షీ సుమన్ కోరాడ మాట్లాడుతూ ప్రతి ఇక్కడ రాష్ట్ర స్థాయిలో కరాటే పోటీలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 11 జిల్లాల నుంచి 550 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్ సీపీ క్లస్టర్ 1 అధ్యక్షుడు ధర్మాల శ్రీను, కోచ్‌లు మోడీ నాయుడు, పి.శివ ప్రసాద్, ఎండీ నాయుడు, ఢిల్లీశ్వరరావు, ఉమా మహేష్, ఆనంద్ బాలు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

యలమంచిలి: యలమంచిలి మున్సిపాలిటీ కొక్కిరాపల్లి హైవే కూడలి వద్ద ఆదివారం రాత్రి పండ్ల లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుంచి సాలూరు పండ్ల లోడుతో వెళుతున్న లారీ కొక్కిరాపల్లి హైవే పై అదుపు తప్పి బోల్తా కొట్టిందని, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదని ప్రమాదం వల్ల కొంత ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిందని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించామని, దీనిపై ఎటువంటి ఫిర్యాదు తమకు అందలేదని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

విద్యుత్ షాక్‌తో పూర్తిగా దెబ్బతిన్న సతీష్‌రాజు వెన్నుముక



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సతీష్‌రాజు

మాడుగుల రూరల్: అతడొక దినసరి కూలీ.. పొట్టకూటి కోసం ఎప్పటిలాగానే పనికి వెళ్లిన పాపానికి విధికి కన్ను కుట్టిందేమో.. విద్యుత్తు తీగలు విసిరిన పంజాకు పూర్తిగా వెన్నుముక దెబ్బతిని ఆస్పత్రి పాలయ్యాడు. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దాతల ఆపన్నహస్తం ఎదురు చూపులు చేస్తున్నాడు. మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామానికి చెందిన గొర్లె సతీష్‌రాజు డక్కింగ్ పని చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి మేడ మీద నుంచి పడిపోయి గాయాల పాలైన విషయం విదితమే. భవనాలకు అతడు డక్కింగ్ పనులు చేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాడు. శనివారం సాయంత్రం గ్రామంలోని సాకా నానాజీ ఇంటి నిర్మాణం డక్కింగ్ చేస్తుండగా పక్కనే ఉన్న 12 కె.వి. విద్యుత్ లైన్‌కు కర్ర తగిలి షాక్‌కు గురయ్యాడు. దాంతో పనిచేస్తున్న మేడ మీద నుంచి కిందకు పడిపోయాడు. దాంతో వెన్నుముక పూర్తిగా దెబ్బతింది. కాళ్లు, చేతులు పూర్తిగా చచ్చుపడిపోయాయి. వెంటనే విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ప్రాణాప్రాయ స్థితిలో వున్న సతీష్‌రాజు దుస్థితిపై విద్యుత్, రెవెన్యూ అధికారులు స్పందించి తగు సహాయం అందించాలని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. దాతలు సైతం ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. వైద్యానికి లక్ష రూపాయలు ఖర్చవుతుందని తెలిపారు.

వెయ్యి లీటర్ల సారా పులుపు ధ్వంసం



సారా పులుపును పారబోస్తున్న మహిళా పోలీసు మనీసా

చీడికాడ: మండలంలోని అర్జునగిరి, కలిగొట్ల గ్రామాల పొలిమేరల్లో సారా తయారికి ఉపయోగించే వెయ్యిలీటర్ల బెల్లం పులుపు, సారా తయారి సామాగ్రిని గుర్తించినట్టు అర్జునగిరి సచివాలయానికి చెందిన మహిళా పోలీసు మనీషా తెలిపారు. శనివారం సాయంత్రం నాటుసారా తయారీకి సంబంధించి పులుపు, సామాగ్రి అర్జునగిరి, కలిగొల్ల పొలిమేరల్లో గల తాటిచెట్లు వద్ద ఉన్నట్టు అందిన సమాచారం మేరకు వెళ్లి పరిశీలించగా నాలుగు ప్లాస్టిక్ డ్రముల్లో బెల్లం పులుపును గుర్తించామన్నారు. చీడికాడ పోలీసులకు సమాచారం అందించి వాటిని పారబోసి, సారా తయారీకి వినియోగించే పొయ్యి ఇతర సామాగ్రిని ధ్వంసం చేశామని తెలిపారు. బట్టీ నిర్వాహకులు ఎవరనేది విచారణ చేస్తున్నామన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 20 నుంచి బైక్ యాత్ర

అనకాపల్లి టౌన్: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 20 నుంచి ఉత్తరాంధ్రలో బైక్‌యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో బైక్ యాత్ర పోస్టర్‌ను విడుదల చేసి కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 36 మంది ప్రాణత్యాగంతో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవాలన్నారు. ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకూ ఆరు జిల్లాల్లో 1,200 కిలోమీటర్ల మేర బైక్ యాత్ర నిర్వహిస్తామన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ పోరాటాల ద్వారానే కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, కాళ్ల తెలయ్యబాబు, చింతకాయల శివాజీ, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి



మృతుడు మహేష్ (ఫైల్)

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం పరిధి అప్పికొండ వద్ద విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందగా..మరో ఇద్దరు గాయపడ్డారు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం గాజువాక పరిధిలోని చినగంట్యాడకు చెందిన కనిమెరక మహేష్ (15) మూడు రోజులుగా వినాయక మండపాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. శనివారం రాత్రి మండపం వద్ద పడుకుని ఆదివారం వస్తానని తల్లి భారతికి చెప్పి వెళ్లాడు. ఆదివారం 10.30 గంటలు అయినా రాకపోయేసరికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. పదేపదే చేస్తుండగా ఓ వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి ముగ్గురు యువకులు అప్పికొండ వద్ద బైక్‌ను విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారని, అందులో ఒకరు మృతి చెందాడని సమాధానం చెప్పడంతో వెంటనే మహేష్ కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన యువకుడు తన కొడుకు మహేష్‌గా గుర్తించి కన్నీరుమున్నీరయ్యారు. గాయపడిన మరో ఇద్దరు యువకులు దినేష్, భరత్‌గా గుర్తించారు. గాయపడిన యువకులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. తల్లి భారతి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుని పరామర్శించేందుకు వెళుతూ ...

గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో యువకుడి మృతి



హేమంత్(ఫైల్)

గోపాలపట్నం: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు వెళ్తున్న యువకుడ్ని షీలానగర్ సమీపంలోని సోలార్ ప్లాంట్ వద్ద గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి పట్టణంలోని రామభద్రాపురం సమీపంలో ఏఎంఏఎల్ కళాశాల సమీపంలో నివాసముంటున్న యడ్ల హేమంత్ కుమార్ (26) శనివారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో కేజీహెచ్‌లో బంధువును పరామర్శించేందుకు తన స్నేహితుడితో ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. షీలానగర్ మీదుగా వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న హేమంత్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న హేమంత్ స్నేహితుడు రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడు హేమంత్ ఏషియన్ పెయింట్స్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి తల్లి, తమ్ముడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి గల కారణాలను ట్రాఫిక్ ఏడీసీపీ జీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్,కంచరపాలెం సీఐ మళ్ల అప్పారావు ఆదివారం పరిశీలించారు. ఢీకొట్టిన వాహన వివరాలు తెలుసుకునేందుకు ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. మృతుడు తమ్ముడు మల్లికార్జునరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చట్టాలపై సాహిత్య ప్రభావం

ప్రముఖ రచయిత్రి ఓల్గా



సీతంపేట: సమాజంలో ఎలాంటి చట్టాలు రావాలన్నా దానిపై సాహిత్యం ఎప్పుడూ చర్చిస్తూ ఉంటుందని ప్రముఖ రచయిత్రి ఓల్గా అన్నారు. కొండపల్లి కోటేశ్వరమ్మ ఐదో వర్ధంతి సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'చట్టం, సాహిత్యం' అను అంశంపై ఆమె స్మారకోపన్యాసం చేశారు. ఉన్న చట్టాలు, రాని చట్టాలపై విమర్శ కూడా చేస్తూ ఉంటుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను రచయితలు అక్షరబద్ధం చేస్తారని, తిరిగి ప్రజలు ఆ రచనలను చదివి తమ ఆకాంక్షల్లో న్యాయం ఉందని గ్రహించి దానిచుట్టూ ఉద్యమం చేస్తారని ఫలితంగా చట్టం వస్తుందన్నారు. మనుషుల్లో సంస్కారం పెరుగుతున్న క్రమంలో సమాజాన్ని మార్చుకోవాలన్న ఆకాంక్ష పెరుగుతుందని, దానికి రచయితలు ఒక రూపం ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సూర్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీహెచ్.రాఘవేంద్రరావు, ఎ.విమల, క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైశాఖీ నృత్యోత్సవం

ముగిసిన భారతీయ నాట్యకేళీ సంరంభం



పేరిణి నాట్య కళాకారిణి డాక్టర్ కళాకృష్ణ నాట్య విన్యాసాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

మద్దిలపాలెం : వైశాఖీ నృత్యోత్సవం వైభవంగా ముగిసింది. దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాత నాట్యకౌముదులు తరలివచ్చి నాట్యం చేశారు. కథక్, భరతనాట్యం, కూచిపూడి, మోహినీయట్టం, సంబల్‌పూరీ జానపద నృత్యం, తెలంగాణ పేరిణీ నాట్యం... ఇలా భారతీయ సంస్కృతిలో ప్రముఖ కళా నృత్యాలన్నింటికీ గత మూడు రోజులుగా మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో వైశాఖీ నృత్యోత్సవం వేదికగా నిలిచింది. సాంస్కృతిక రాజధానిగా ప్రాముఖ్యతను సొంతం చేసుకున్న విశాఖ గడ్డ అంతర్జాతీయ నాట్య కళాకారులను సత్కరించుకోవడంతోపాటు, నాట్యవిన్యాసాలతో పులకించిపోయింది. అంగరంగ వైభవంగా సాగిన వైశాఖీ నృత్యోత్సవం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, వీవీ రమణమూర్తి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, ఫెస్టివల్ డైరెక్టర్ బత్తిన రంగ విక్రమ్ కుమార్‌గౌడ్ నేతృత్వంలో వైశాఖీ జీవన సాఫల్య పురస్కారాన్ని తెలంగాణకి చెందిన పేరిణి నృత్య కళాగురువు డాక్టర్ కళాకృష్ణకు అందించారు. వైశాఖీ ఎక్స్‌లెన్స్ అవార్డులను కూచిపూడి నాట్య గురువు కన్నం వెంకటరమణారావుకు, డాక్టర్ ఖాజా వి.సుబ్రహ్మణ్యంకు అందజేశారు. జాతీయ యువ పురస్కారాన్ని తెలంగాణకు చెందిన కూచిపూడి నాట్య కళాకారిణి క్రాంతి నారాయణ్‌కు, వైశాఖీ నాట్యశ్రీ అవార్డుతో ఒడిశాకు చెందిన మయూర్ భంజ్ ఛౌను సత్కరించారు. అనంతరం ఆంధ్రా నాట్య విన్యాసంతో జీవన సాఫల్య పురస్కారగ్రహీత డాక్టర్ కళాకృష్ణ, తర్వాత ఒడిశాకు చెందిన మయూర్ భంజ్ ఛౌ బృందం నాట్యవిన్యాసంతో అందరి హృదయాలను కట్టిపడేశారు. తెలంగాణకు చెందిన కూచిపూడి నాట్య కళాకారిణి క్రాంతి నారాయణ్ నాట్యాలయ బృందం కూచిపూడి నాట్యంతోపాటు చాండలిక నృత్యరూపకంతో ఆకట్టుకున్నారు. ఈ నృత్యరూపకం ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ప్రేక్షకులను కట్టిపడేసింది. అనంతరం వేడుకల్లో పాల్గొన్న కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.

క్లుప్తంగా

భోగ లింగేశ్వరునికి పట్టువస్త్రాల సమర్పణ



కొణతాల మురళీకృష్ణను సన్మానిస్తున్న ఆళ్ల నాగేశ్వరరావు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం సర్వకామదాంబ సమేత భోగ లింగేశ్వరస్వామికి నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నూతన పాలకవర్గంతో కలిసి పట్టువస్త్రాలతోపాటు, అమ్మవారికి ప్రత్యేకంగా పట్టుచీర, పూలదండలు, పూజా సామాగ్రి అందించారు. అంతకు ముందు చైర్మన్‌తోపాటు పాలకవర్గాన్ని ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు సాదరంగా ఆహ్వానించి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొణతాల కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, కాండ్రేగుల రాము, దేవదాయ సిబ్బంది మళ్ల రామగణేష్, కొణతాల లక్ష్మి పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెంలో పవర్ వారియర్స్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఒకటో రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఎన్టీపీసీకి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. సమీక్షా సాహు రెండు బంగారు పతకాలు, టి.సుమశ్రీ, టి.భవ్యశ్రీ, కె.కె.ఎస్ సాత్విక్ బంగారు పతకం, రాగి పతకాలను కైవసం చేసుకున్నారు. పి.అభి రజత పతకం, డి.ప్రియాన్స్ వెండి పతకం, పి.అజయ్‌కుమార్ వెండి, రాగి పతకం, ఎస్.క్యాతినాథ్ రెండు బంగారు పతకాలు సాధించి సత్తా చాటారు. పోటీల్లో మాస్టర్లు జి.పుష్పారావు, ఎం.తులసీరావు, గొర్లి వంశీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: ఏపీ ట్రాన్స్‌కో సీలేరు–గాజువాక హెచ్‌టీ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా సబ్బవరం సెక్షన్–1 పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం సెక్షన్–1 పరిధిలోని పెదనాయుడుపాలెం, ఆదిరెడ్డిపాలెం,చిన్నయ్యపాలెం,తవ్వవానిపాలెం,అమృతపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

అనకాపల్లి సినిమాలు

ఛాంగురే బంగారురాజా	:	రాజా
మార్క్ ఆంటోని	:	సత్యనారాయణస్క్రీన్-1
ది నన్	:	సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	:	షిర్డిసాయి
జవాన్	:	షిర్డిసాయి
జవాన్	:	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:	శ్రీసత్య
ఖుషి	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు, బీ పాజిటివ్–35 యూనిట్లు, బీ నెగిటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్–16 యూనిట్లు, ఏబీ నెగిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 365 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రథమ పూజకు ప్రమథ గణాధిపతి

- పర్యావరణ హితంగా చవితి పూజ
- ఊరూవాడా మట్టి విగ్రహాల పంపిణీ

'వినయతి శిక్షయతి దుష్టాన్ విఘ్నాంశ్రేతి వినాయకః'దుష్టులను, విఘ్నములను శిక్షించేవాడు వినాయకుడు. అందుకే నిత్య జీవితంలో ప్రతి శుభారంభం వినాయక పూజతోనే. 'తలచితినే గణనాథుని తలచితినే విఘ్నపతిని దలచిన పనిగా.. దలచితినే హేరంభుని దలచిన నా విఘ్నములను తొలగుట కొరకున్'అంటూ ప్రమథ గణాధిపతిని పూజించేందుకు ఊరూవాడా సిద్ధమయింది. పర్యావరణ హిత చవితి పూజకు పర్యావరణ ప్రేమికులు, ప్రజాప్రతినిధులు మట్టి గణపతి విగ్రహాలను ఊరూరా పంచిపెట్టారు.



నెహ్రూచౌక్‌లో చిన్నారికి మట్టి గణపతి ప్రతిమను అందిస్తున్న సీఐ మోహన్‌రావు

అనకాపల్లిటౌన్/కశింకోట: ప్రమథ గణాధిపతికి ప్రథమ పూజ చేసేందుకు ఊరూవాడా సిద్ధమయింది. నియోజకవర్గ పరిధిలో ఊరూరా వీధుల్లో చవితి మండపాలు, పందిళ్లు వేసి గణనాథుని కొలువు దీర్చేందుకు భక్తులు, యువత ఏర్పాట్లు పూర్తి చేశారు. పర్యావరణ హిత చవితి పూజలకు ప్రతి ఒక్కరూ నడుం బిగించారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతనిధులు, పర్యావరణ ప్రేమికులు భారీగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. చవితి సరంజామా కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి.

- పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ క్లబ్ సేవలు అమోఘమని పట్టణ సీఐ దాడి మోహనరావు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో క్లబ్ ఆధ్వర్యంలో 3,500 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లగా పర్యావరణ పరిరక్షణకు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్ చేస్తున్న కృషిని అభినందించారు. అంతకు ముందు వినాయక ప్రతిమలతోపాటు వ్రతకల్పం పుస్తకాలు, పసుపు, కుంకుమ, పటిక, మొక్కలను అందించారు. శ్రీధర్ సేవలకు తన వంతు సాయంగా జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ ఆడారి రవిబాబు రూ.10,116లు అందించారు. కార్యక్రమంలో సోదర సంక్షేమ సమితి అధ్యక్షుడు కొణతాల పూర్ణ, విశ్రాంత అటవీ శాఖ అధికారి బీరా వినోద్‌కుమార్, క్లబ్ సభ్యులు సత్యనారాయణ, యల్లపు సూరి అప్పారావు, కర్రి హనుమంతరావు, గంట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- పట్టణంలోని రింగ్‌రోడ్డు దాడి క్యాంప్ కార్యాలయం వద్ద వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కమిటీ వ్యవస్థాపకుడు ఆడారి కుమారస్వామి, సభ్యులు మళ్ల సురేంద్ర, ఆళ్ల నాగేశ్వరరావు, రేబాక మధు పాల్గొన్నారు.
- గవరపాలెంలో యంగ్ స్టూడెంట్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాపారవేత్త పీలా శ్యామ్ మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు దాడి ఈశ్వరరావు, ఎస్ఎం నాయుడు, కె.రాజశేఖర్, జగదీష్, కేవీఎస్ ఉమ, డి.ఆది, కె.కుమార్, వి.వి.పాండు, కృష్ణ పాల్గొన్నారు.
- గవరపాలెం నూకాంబిక ఆలయం వద్ద ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణలు మట్టి గణపతి విగ్రహాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎస్కే చాంద్‌బాషా, పిళ్లా చంద్రశేఖర్, పొలిమేర నాగశ్రీను, పూసర్ల రాజా, సతీష్, గంటా శ్రీనివాసరావు, బుద్ధ జగన్, రామకృష్ణ, కె.చంద్రశేఖర్, మూర్తి, షణ్ముఖ్, ఆరిఫ్, జగదీష్‌లు పాల్గొన్నారు.
- పీలా రాజారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీదేవిపేటలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు పీలా తులసీరాం 1,500 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేబాక మధు, సభ్యులు పాల్గొన్నారు.
- మండలంలో తుమ్మపాల జీవిత బీమా సేవా కేంద్రం వద్ద మాజీ ఆర్మీ ఉద్యోగి ముమ్మన అప్పారావు చిన్నారులచే మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.



పంపిణీకి సిద్ధం చేసిన మట్టి గణపతి ప్రతిమలతో యంగ్ స్టూడెంట్ క్లబ్ సభ్యులు

మార్కెట్లకు చవితి శోభ

వినాయక చవితి సందర్భంగా మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. విగ్రహాలు, పత్రి, పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడి నెలకొంది. కశింకోటలోని సంతలో పలు చోట్ల దుకాణాలు ఏర్పాటు చేసి వివిధ పరిమాణాల్లో రంగుల విగ్రహాలను అమ్మకానికి పెట్టారు. వీటిలో మట్టి ప్రతిమలను కూడా ఎక్కువగా ఉంచారు. విగ్రహాల సైజును బట్టి రూ.20 నుంచి రూ.5 వేల వరకు అమ్మకాలు సాగాయి. నియోజకవర్గంలో చాలా చోట్ల పెద్ద ఎత్తున ఉత్సవాల నిర్వహణకు యువత రాత్రీపగలూ కష్టపడి చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల సినీ సెట్టింగ్‌లతో అందంగా ముస్తాబు చేశారు.



భక్తులకు మట్టి గణపతి ప్రతిమను అందిస్తున్న ఆలయ ఈవో ప్రసాద్, చైర్మన్ మురళీకృష్ణ



లక్ష్మీదేవిపేటలో చిన్నారికి మట్టి గణపతిని అందిస్తున్న తులసీరాం



తుమ్మపాలలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీలో చిన్నారులు



రంగు వినాయక ప్రతిమల మధ్య మట్టి వినాయక విగ్రహాలు

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



కోమటివీధిలో ఉన్న సాయిబాబా మందిరంలో మోదీ ఫొటోతో పూజలు చేస్తున్న నాయకులు

కశింకోట: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటి వీధిలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం పేదలకు నారాయణసేవ నిర్వహించారు. కస్పావీధి రామాలయం, అయ్యప్పస్వామి ఆలయం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, హౌసింగ్ కాలనీ ముత్యాలమ్మ ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, కోదండ సీతారామాలయం బోర్డు మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. తాళ్లపాలెంలో కూడా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు ఆధ్వర్యంలో మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ

కోటవురట్ల: నీలిగుంటలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆదివారం పంపిణీ చేశారు. సర్పంచ్ వరహాలబాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ వరహాలబాబు మాట్లాడుతూ తమ గ్రామంలో కొత్తగా ఆరుగురికి పింఛన్లు మంజూరైనట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రాజకీయం లేకుండా పింఛన్లు మంజూరు చేస్తోందన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందార్లకు రుణాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్

కశింకోట: గొర్రెలు, మేకల పెంపకందారులకు రుణాలు ఇవ్వాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు గంటా శ్రీరామ్ కోరారు. మండలంలోని తేగాడలో ఆదివారం గొర్రెలు, మేకల పెంపకందార్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత పశు వైద్యం, గొర్రెలు, మేకలు రాత్రి వేళ బసలకు స్థల కేటాయింపు, ఉపాధి పథకంలో షెడ్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. నట్టల నివారణ మందులు ఏడాదికి నాలుగు సార్లు ఇవ్వాలని, అన్ని వాక్సిన్లు ఉచితంగా అందించాలన్నారు. తెలంగాణా రాష్ట్రం తరహాలో గొర్రెలు, మేకలు పెంపకందారులకు బీమా సదుపాయం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సర్వసిద్ధి తాతారావు, ప్రతినిధులు పల్లా వెంకయ్యనాయుడు, చందక నాగేశ్వరరావు, కుండల శ్రీను, పక్కుర్తి వెంకటఅప్పారావు, కుండల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగాలులతో భారీ వర్షం

కశింకోట: కశింకోటలో ఆదివారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. రైతుల్లో ఆనందం నింపింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ముందుగా భారీ వీచాయి. తర్వాత కుండపోత వర్షం కురిసింది. ఇటీవల కొన్నాళ్లుగా సరైన వర్షాలు పడలేదు. వరి రైతులు ఆందోళన చెందారు. తాజాగా భారీ వర్షం కురవడంతో వరి పొలాలు, నాట్లకు బాగా ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గాలీవానతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు



మట్టి వినాయక ప్రతిమలు అందిస్తున్న దాడి రత్నాకర్

కశింకోట: పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకుని వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవచ్చని, ఇందుకు ప్రభుత్వం, పోలీసుల నుంచి ఎటువంటి ఆంక్షలు లేవని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ స్పష్టం చేశారు. స్థానిక కస్పావీధి, పొట్టి శ్రీరాములు పార్కు వద్ద దాడి రత్నాకర్ యువసేన ప్రతినిధి వేగి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సుమారు వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చవితి ఉత్సవాల్లో ఆంక్షలు విధించారంటూ కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోవద్దన్నారు. హిందువుల మనోభావాలు, సంప్రదాయాలు కాపాడే ప్రభుత్వం తమదన్నారు. ప్లాస్టరాఫ్ పారిస్‌తో తయారు చేసిన రంగుల విగ్రహాలు పూజించి నదిలో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితం అవుతుందన్నారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు నియోజక వర్గంలో సుమారు ఏడు వేల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ పూల కుండీలు, మొక్కల కుండీల్లో మట్టి వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయవచ్చన్నారు. వాటిలో విత్తనాలు నాటుకొని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి కృష్ణ, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, స్థానిక నాయకులు దాసరి బాబు, తిమ్మాపతిన నాగేశ్వరరావు, కోలాటం నాగు, గొంతిన శ్రీను, గొంతిన లోవ అప్పారావు, పెంటకోట నాయుడు, పెంటకోట సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట దిగుబడుల పెంపు



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం శిక్షకులు వెంకటరమణ

మునగపాక : ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట దిగుబడులు పెరుగుతాయని తద్వారా ఆదాయం పెంచుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం శిక్షకులు వెంకటరమణ, సత్యనారాయణ పేర్కొన్నారు. మునగపాక మండలం గణపర్తిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. భూసారం పెరుగుతుందన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చదరం నాయుడు, పాలసంఘ అధ్యక్షులు చదరం కొండలరావు, రైతులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: విద్యార్థులు చదువుతో పాటు కరాటే అభ్యసించడానికి ఆసక్తి చూపాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వెన్నలపాలెంలోని సింహాద్రి కల్యాణ మండపంలో రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభా వంతులను వెలుగులోకి తీసుకురావడానికి ఈ కరాటే పోటీలు దోహదపడతాయన్నారు. కరాటే మహిళల ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తమ పిల్లలకు కరాటే నేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, కలపాక సర్పంచ్‌లు కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, చింతకాయల సుజాత ముత్యాలు, బొండా కనకారావు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు, కరాటే చీఫ్ ఆర్గనైజర్ ఒలిశెట్టి ప్రసాద్, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



కశింకోట ఉప్పునీటి దిబ్బ వీధి వినాయకుని సన్నిధిలో భక్తులు



అన్నదానంలో భక్తులు

కశింకోట: స్థానిక ఉప్పునీటి దిబ్బ వీధిలో ఉన్న వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవం నిర్వహించారు. ఏటా వినాయక చతుర్థి ముందు రోజు ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా వినాయకుడిని వెండి ఆభరణాలు, పూల దండలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రాల నడుమ హోమం నిర్వహించారు.

భారీ ఎత్తున అన్న సమారాధన జరిపారు. పడమటమ్మ ఉత్సవ కమిటీ ప్రతినిధులు శిష్టి అప్పారావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కలగా శివానందం, నడిపల్లి సన్యాసిరావు, గొన్నాబత్తుల ఆదిశేషు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా విశ్వకర్మ యోజన పథకం

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



విశ్వకర్మకు పూజలు చేస్తున్న బీజేపీ నేతలు

అనకాపల్లిటౌన్: విశ్వకర్మ యోజన పథకాన్ని పార్టీలకతీతంగా వివిధ వృత్తుల వారికి అందించడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. పథకాన్ని ఢిల్లీలో ప్రధాని మోదీ ప్రారంభించిన నేపథ్యంలో జిల్లా పార్టీ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు పార్టీ నేతలు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఉన్న వినాయకుని ఆలయం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కంచిపాటి సన్యాసిరావు, నేతలు అలమండ శ్రీను, కర్రి రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవీ సత్యనారాయణ, నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌యాదవ్, కె.తాతారావు, కార్మికులు పాల్గొన్నారు.

- విశ్వకర్మ జయంతిని కేంద్రం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. తొలుత కామాక్షమ్మ ఆలయంలో విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని రథంపై ఉంచి ఊరేగింపు ప్రారంభించారు. ఊరేగింపు పట్టణ పురవీధులగుండా స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి వద్దనున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి, అక్కడి నుంచి తిరిగి కామాక్షమ్మ ఆలయానికి చేరుకుంది. అంతకుముందు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి, సంఘ అధ్యక్షుడు జేజిబాబులు రత్నాకర్‌ను ఘనంగా సత్కరించారు. సంఘ కోశాధికారి గోవిందరాజు, పొన్నాడ నరసింహాచారి పాల్గొన్నారు.
- స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ రక్తనిధి సిబ్బంది రాజు, గీత యువకుల నుంచి రక్తాన్ని సేకరించారు.



ఎన్టీఆర్ వైద్యాలయంలో యువకుల రక్తదానం



ఊరేగింపును ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

'ఓడితే రాజకీయ సన్యాసం'

కశింకోట: రానున్న ఎన్నికల్లో ఓటమి చెందితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ అన్నారు. మండలంలోని చింతలపాలెంలో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విడుదల చేయాలని కోరుతూ ఆదివారం నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తమదే విజయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం



వాడచీపురుపల్లిలో మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం నెలరోజులుగా మూతపడడంతో వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం పరిసర గ్రామాలకు చెందిన బ్యాంకు ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. ఏటీఎం పని చేయకపోవడంతో బ్యాంకు లావాదేవీలు జరపడానికి దీపాంజలినగర్, పరవాడ ప్రాంతాల్లోని ఏటీఎంలపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల అవస్థలను గుర్తించి వాడచీపురుపల్లి కూడలిలోని ఏటీఎం సెంటర్‌ను వినియోగంలో తీసుకురావడానికి బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు. సాంకేతిక పరమైన మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులకు నివేదించామని వాడచీపురుపల్లి స్టేట్ బ్యాంకు మేనేజర్ జి.కె.కిరణ్‌కుమార్ చెప్పారు. త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి భరోసా



జగనన్న ఆరోగ్య సురక్ష పరీక్షలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ పేర్కొన్నారు. మునగపాకలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సురక్ష కార్య క్రమం విజయవంతంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు.ఇటువంటి కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసు కునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, ఏఎన్ఎం దేవకి, స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.